# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-11-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **బ్రెజిల్‌లో జరుగుతున్న జి 20 సదస్సులో భాగంగా బ్రిటన్, ఇటలీ సహా పలు దేశాల నేతలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు.**
2. **రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఏడో రోజు కొనసాగుతున్నాయి.**
3. **చెత్త నుంచి సంపద సృష్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు.**
4. **రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**
5. **పదవ తరగతి సార్వత్రిక పరీక్షల రుసుము చెల్లింపు గడువును మరో వారం రోజులు పొడిగించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.**

============================

బ్రెజిల్ రాజధాని రియో డి జెనీరోలో జరుగుతున్న జి 20 సదస్సు సందర్భంగా బ్రిటన్, ఇటలీ, ఫ్రాన్స్, నార్వే, పోర్చుగల్, ఇండోనేషియా దేశాలతో సహా పలు దేశాల నేతలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఈ సమావేశాల్లో దేశాల సంబంధాలను మెరుగుపరచుకోవడం, బలోపేతం చేసుకోవడంపై చర్చించారు. నరేంద్రమోదీ బ్రిటన్ ప్రధానమంత్రి కైర్ స్టార్మర్‌తో సమావేశాన్ని నిర్వహించారు. రాబోయే సంవత్సరాల్లో, గ్రీన్ ఎనర్జీ, భద్రత, ఆవిష్కరణలు, సాంకేతికత వంటి రంగాలలో ఇరు దేశాలు ఆసక్తిగా ఉన్నాయని సామాజిక మాధ్యమం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనితో నరేంద్రమోదీ ద్వైపాక్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఇరుదేశాల మధ్య రక్షణ, భద్రత, వాణిజ్యం, సాంకేతికత పరిజ్ఞానం రంగాలలో సహకారాన్ని పెంపొందించుకోవడంపై చర్చించారు.

---------------------------

శాసనసభ సమావేశాలు ఏడో రోజు కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతోంది. శాసన సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు కూడా పలు బిల్లులను శాసన సభలో ప్రవేశపెట్టనుంది. సహకార సంఘాల చట్ట సవరణ బిల్లు, ఎక్సైజ్ చట్టసవరణ బిల్లు, విదేశీ మద్యం వాణిజ్యం చట్ట సవరణ బిల్లులను సంబంధిత శాఖల మంత్రులు ప్రవేశపెట్టనున్నారు. అలాగే విశాఖ రుషికొండ నిర్మాణాలు, పోలవరం, ఇతర జలవనరుల ప్రాజెక్టులపై సభలో లఘు చర్చ జరుగనుంది. శాసన సభ ఆమోదించిన వివిధ బిల్లులను ఈరోజు శాసనమండలిలోనూ ఆమోదించనున్నారు.

ఇది ఇలా ఉండగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రేపు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర సచివాలయంలో జరుగనున్న ఈ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను పంపాలని అన్ని శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు.

-----------------------------

చెత్త నుంచి సంపద సృష్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారించ వచ్చని అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం సంపద కేంద్రాలపై దృష్టి సారించిందని ఉపముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ( 30 సెకన్లు)

-----------------------------

రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ఎత్తిపోతల పథకాలు, పూడికతీతలపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, అత్యవసర పనుల కోసం 284 కోట్ల రూపాయలను నిధులు మంజూరు చేశామని చెప్పారు. ప్రస్తుతం టెండరు ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ( 33 సెకన్లు)

-----------------------------

రాష్ట్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ అందిస్తున్న పలు రకాల సేవలను ప్రజలకు మరింత సులభతరం చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి ఆర్.పి. సిసోడియా ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తికి సంబంధించిన ఆర్థిక లావాదేవీల సమగ్ర పత్రం - ఎంకంబరెన్స్ సర్టిఫికెట్–ఈసీ, ధృవీకరించబడిన నకలు–సీసీల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, మీసేవ కేంద్రాలకు వెళ్ళకుండా... నేరుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని వెల్లడించారు. ఆన్‌లైన్ విధానంలో అవసరమైన రుసుము.. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు చెల్లిస్తే ఆయా సేవలు పొందవచ్చని సిసోడియా తెలిపారు.

-----------------------------

వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదవ తరగతి సార్వత్రిక పరీక్షల రుసుము చెల్లింపు గడువును మరో వారం రోజులు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వరకు ఆలస్య రుసుము లేకుండా పరీక్ష రుసుము చెల్లించొచ్చని సూచించారు. 50 రూపాయలతో డిసెంబరు 2 వరకు, 200 రూపాయలతో డిసెంబరు 9 వరకు, 500 రూపాయల ఆలస్య రుసుముతో డిసెంబరు 16 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

-----------------------------

ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం ద్వారా రైతులకు ఆర్థిక చేయూతను అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా శాసనమండలిలో

సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ,

వాయిస్ (17 సెకన్లు)

---

విజయవాడ రైల్వే డివిజన్‌లోని గన్నవరం–ముస్తాబాద్, చేబ్రోలు మార్గంలో ట్రాఫిక్ నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే, పౌర సంబంధాల అధికారి ఈరోజు ఒక ప్రకటనలో వెల్లడించారు. ధన్‌బాద్– అల్లపుజా, టాటా– యశ్వంతపూర్,టాటా – ఎస్ ఎం వి బెంగుళూరు, హటియా ఎర్నాకులం, విశాఖపట్నం షిర్డీ సాయి నగర్, విశాఖపట్నం – హజ్రత్ నిజాముద్దీన్ రైళ్లను నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ విజయవాడ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు.

---

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన వయో వందన కార్డుకు 70 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల 10 లక్షల మంది వయో వృద్ధులు నమోదు చేసుకోవడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. ఈ కార్డ్ ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద ఉచిత ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలను పొందేందుకు వృద్ధులకు ఉపయోగపడుతుంది. ఆయుష్మాన్ వయో వందన కార్డు కింద 4 లక్షల మహిళలు నమోదు చేసుకున్నారని, అక్టోబరు 29న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన మూడు వారాల్లోనే ఈ మైలురాయిని సాధించినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది.

---

రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా శాసనసభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ,

వాయిస్ ( 21 సెకన్లు)

---

వీధి వ్యాపారస్తులకు ఆర్థిక చేయూతను అందించేందుకు ప్రధానమంత్రి స్వానిధి పథకం కింద 15 రోజులు ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నామని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్ ఎమ్ ధ్యానచంద్ర తెలిపారు. కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ చేపట్టిన జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్ అమలుపై ఆ శాఖ సంయుక్త కార్యదర్శి రాహుల్ కపూర్ నిన్న నిర్వహించిన సమావేశంలో దృశ్య మాధ్యమం ద్వారా కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ప్రధానమంత్రి స్వానిధి యోజన పథకం ద్వారా విధి వ్యాపారస్తులకు కల్పించే రుణాలపై అవగాహన కల్పిస్తామని కమిషనర్ వివరించారు.

---

ఝాన్సీ రాణి లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. ధైర్యం, దేశభక్తికి ప్రతీక అయిన రాణి లక్ష్మీబాయి స్వాతంత్ర్య పోరాటంలో చూపిన ధైర్యసాహసాలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. అలాగే దేశ ప్రథమ మహిళా ప్రధాన మంత్రిగా పనిచేసిన ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా ఇందిరాగాంధీకి నివాళులర్పించారు.

====================